



జిల్లాలో మిర్చి పంట అమ్ముకోవడానికి మార్కెటింగ్ సౌకర్యం లేక పోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ధర పడిపోయిన సమయంలో పంట నిల్వ చేసుకోవడానికి శీతల గిడ్డంగులు సైతం లేక పోవడంతో రైతులు కష్టాలు రెండింతలవుతున్నాయి. రెండేళ్ల క్రితం మిర్చికి మార్కెట్‌లో ధర ఎక్కువగా పలుకపోవడంతో జిల్లాలో క్రమంగా సాగు పెరుగుతోంది. వచ్చిన పంటను అమ్ముకునేందుకు జిల్లాలో మార్కెట్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నాగ్‌పూర్, వరంగల్ ప్రాంతాలకు తరలిస్తూ అమ్ముకోవల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

# మిర్చి రైతు దిగులు

- పడిపోతున్న ధరలతో ఆందోళన
- పంట నిల్వ కోసం జిల్లాలో శీతల గిడ్డంగులు కరువు
- మహారాష్ట్ర, వరంగల్‌కు తరలించేందుకు అదనపు ఖర్చు
- మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని వినతి

పెంచికలపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిర్చి పంట సాగు చేసిన రైతులు ధరలు పడిపోతుండడంతో దిగులు చెందుతున్నారు. ఆరుగాలం కష్ట పడి పండించిన పంటకు ధరలు ఆశాజనకంగా లేని సమయంలో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకొని ఆశంచిన ధర రాగానే మార్కెట్‌లో అమ్ముకుంటారు. కానీ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శీతల గిడ్డంగులు ఎక్కడా లేవు. దీంతో వరంగల్, మహారా ష్ట్రలోని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవడంతో ఆర్థికంగా భారం పడుతోంది. ఈ వానాకాలం సీజన్‌లో పండించిన మిరప పంట రకరకాల కారణా లతో దిగుబడి తగ్గింది. దీనికి తోడు ధరలు సైతం పతనం అవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

### మూడు వేల ఎకరాల్లో..

జిల్లా వ్యాప్తంగా రైతులు సుమారుగా మూడు వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. పంట సాగు సమయంలో తేజ సన్న రకం క్వింటాలు ధర రూ.21 వేల పైనే ఉంది. దీంతో పంటపై రైతులు ఆశలు పెంచుకున్నారు. పంట చేతికి వచ్చిన సమయానికి విదేశాలకు ఎగు మతులు నిలిచి పోయాయి. దీంతో ప్రస్తుతం నాణ్యమైన మిర్చి ధర క్వింటాలుకు రూ.12 వేలుగా ఉంది. నాణ్యత తక్కువైతే రూ.8 నుంచి రూ.10 వేల వరకే ధర చెల్లిస్తున్నారు. దీంతో పెట్టుబ డులు కూడా వచ్చే పరిస్థితి లేదు. నిల్వ చేద్దామంటే జిల్లాలో శీతల గిడ్డంగులు కరువ య్యాయి. దీంతో అద్దె చెల్లించి వరంగల్, మహారా ష్ట్రలోని ప్రైవేటు శీతల గిడ్డంగుల్లో రైతులు పంట నిల్వ చేసుకుంటు న్నారు. ప్రస్తుతం అక్కడ కూడా గిడ్డంగులు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. దీం తో రెండో కాపు పంటను ఎక్కడ నిల్వ చేయాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చికి మంచి ధర ఉండడంతో ఈ ఏడాది వర్షాకాలంలో రైతులు మిర్చి వైపు మొగ్గు చూపారు. కానీ ప్రస్తుత మార్కెట్‌లో ధరలకు విక్రయిస్తే కనీసం సగం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.150 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతుండగా కౌలు రైతులు మరింత వెచ్చించి సాగు చేశారు. కష్టం క్వింటాలుకు రూ.10 వేల చొప్పున విక్రయిస్తే 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతుకు రూ.1.20 లక్షలు చేతికొస్తాయి. పెట్టుబడి రూ.2 లక్షల వరకు అయినా నేపథ్యంలో ప్రస్తుతం ధరతో ఒక్కో రైతు రూ.50 వేల నుంచి లక్ష మేరకు నష్టం మూటగట్టుకోవాల్సి ఉండడంతో ఏం చేయాలో పాలు పోని పరిస్థితిని మిర్చి రైతులు ఎదుర్కొంటున్నారు.

### తెగుళ్ల బెడదతో..

ఈ ఏడాది ఎర్రనల్లి, దోమకాటు తదితర కారణా లతో ఎకరాకు ఐదు నుంచి 10 లోపు క్వింటాళ్ల దిగు బడికి మించి లేదు. దీనికి తోడు వ్యవసాయ, ఉద్యానవన అధికారులు క్షేత్రస్థాయిలో మిరప పంటల పరిశీలించి రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. గతంలో మిరప పంటను రెండు మూడు దఫాలుగా కోసేవారు. దీంతో మిరప రైతులు మొదటి కోత తరువాత పంటను వదులుకున్నారు. సాధారణంగా ఏప్రిల్‌లో చివరి కోత తరువాత పంటను వదిలేస్తారు. కానీ ఈ ఏడాది మార్చిలోనే పంటను వదిలేశారు. రెండో కోతకు పిలిచిన కూలీలకు సరిపడా డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతు లు పంటను అలానే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జిల్లాలో మార్కెట్ యార్డుతో పాటు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### నాలుగు ఎకరాల్లో మిరప..: దెబ్బటి మహేష్, గుడ్లపేట



నాలుగు ఎకరాల్లో మిరప పంట వేశాను. గతంతో పోలిస్తే దిగుబడి తగ్గింది. దానికి తోడు రేటు కూడా లేదు. ప్రస్తుతం ఉన్న రేటుకు మిర్చి అమ్మితే కనీసం ఎక రాకు లక్షకు పైనే నష్టం వస్తుంది. రేటు పెరుగు తుందేమోనని ఆశతో వరంగల్‌లోని ప్రైవేటు శీతల గిడ్డంగుల్లో పంటను నిల్వ చేశాను. ఇక్కడే ఉంటే ఇబ్బందులు ఉండేవి కావు.



నాగ్‌పూర్‌లోని మిర్చి యార్డు

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

పెంచికలపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. గుడ్లపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, ఏఎంసీ కోనయ్య, ఏవో మనిషా, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సత్యనారా యణ, బీజేపీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు నాగేష్, భీమయ్య, రాజన్న, నానయ్య, భాస్కర్, ప్రభాకర్, వెంకన్న, మహేశ్, అనంత్‌రావు, శోభన్, కాంతారావు, సాయి, సంతోష్ పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో భద్రతా చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ సీఐ రమణకుమార్

కాగజ్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో భద్రతా చర్యలు పూర్తి స్థాయిలో చేపడుతున్నామని ఆర్‌పీఎఫ్ సీఐ రమణ కుమార్ తెలిపారు. గురువారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని చెప్పారు. రైల్వే ప్రాంగణంలో, ఇతర చోట్ల అనుమానాస్పద వస్తువులు పెట్టినా, వ్యక్తులు తిరుగుతున్నా సమాచారం అందించాలన్నారు. రక్షణ చర్యల్లో భాగంగా వివిధ తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై ప్రాచిదేవి, ఏఎస్సై దాసు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం



నెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో రమాదేవి

ఆసిఫాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి జూన్ 6 వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో పది క్రీడా అంశాలలో వేసవి శిక్షణ క్రీడా శిబిరాలను డీవైఎస్‌వో రమాదేవి ప్రారంభించారు. పట్టణంలోని మోడల్ పాఠ శాలలో నెట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బండ మీనారెడ్డి, క్యాంపు ఇన్‌చార్జి తిరుపతి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, రవిందర్, రాకేష్, పాల్గొన్నారు.

## దరఖాస్తుదారులకు నేడు ఇంటర్వ్యూ

కెరమెరి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అఙ్మద్ పాషా తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సకాలంలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. నిబంధనల మేరకు లబ్ధిఆరులను ఎంపిక చేస్తామని తెలిపారు.

## విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలి

ఆసిఫాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాల ను ఎంచుకొవాలని ఎంఈవో సుభాష్ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో మండలంలోని వివిధ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను తన కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ చాటడం సంతోషంగా ఉందన్నారు. అలాగే హోళీ ట్రినిటి పాఠశాలకు చెందిన టాపర్లను అ పాఠశాల చైర్మన్ అరిగెల నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ గాదవేణి మల్లేష్ సన్మానించారు. కార్యక్రమంలో అయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సన్మానం

కెరమెరి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న సాకడ గ్రామానికి చెందిన పెందూరు గీతాంజలి అనే విద్యార్థిని పదో తరగతిలో 530 మార్కులు సాధించడంతో గురువారం ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. గీతాంజలి మండల టాపర్‌గా నిలిచిందని తెలిపారు.. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ భూషన్, మాజీ ఎంపీపీ మోతిరాం, నాయకులు తుకారాం, అనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి, మే 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మధుకర్ అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచితుల ద్వారా ఫోన్ కాల్స్ వస్తే ఎత్తకూడదని చెప్పారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందచేయాలని సూచించారు. నకిలీ పత్తి విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు.

# ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

- జిల్లాలో పలు చోట్ల జెండాలు ఎగురవేత
- పాల్గొన్న ఆయా సంఘాల నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యా ప్తంగా గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసి డిపో, సివిల్ సప్లై గోదాంల ఆవ రణలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపెందర్ జెండాను అవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దినకర్, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయాల్లో సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు కృష్ణమాచారి జెండాలను అవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసి, ఐఎఫ్‌టీయూ కార్యాల యంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండలంలోని బుర్గూడలో సీపీఐ మండల కార్యదర్శి శంకర్ జెండాలను అవిష్కరించారు. బూర్గుడ సబ్‌స్టేషన్ అవరణలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జెండా అవిష్క రించారు. ఆయా కార్యక్రమాల్లో నాయ కులు దివాకర్, చిరంజీవి, మోహన్, తుకారం, సుధాకర్, శ్రీనివాస్, టికానంద్, మల్లేష్, చంద్రశేఖర్, ఎమ్మాజీ సతీష్ శ్రీనివాస్, సన్మాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో గురువారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు, కాంట్రాక్టు వర్కర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వ హించారు. ఈ ర్యాలీ పట్టణ వీధుల గుండా సాగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్యక్రమాల్లో సిర్పూరు పేపర్ మిల్లు మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరి కూశన్న రాజన్న, శంకరమ్మ, రాయుడు చంద్రశేఖర్, గౌజ్, జాడి మల్లయ్య, సంజీవ్, ఆనంద్‌కుమార్, పద్మ, దస్తగిర్, వై.అరుణ పాల్గొన్నారు. ఐఎన్‌టీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కా ర్యదర్శులు చంద్రశేఖర్, ఎమ్మాజీ సతీష్, రైస్, కలికోట రమణయ్య, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ పాల్గొన్నారు. ఇఫ్టూ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమం లో ఏరియా కమిటీ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

**రెబ్బెన, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మే డే వేడు కలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ సీఐటీయూసీ నుంచి ఏఐటీయూసీలోకి చేరిన కార్మికు లకు కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో నాయకులు రత్నం దేవాజీ, దుర్గం వెంకటేష్, సీనియర్ నాయకులు సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. గోలేటి బ్రాంచ్ కెఎల్ మహేంద్ర భవన్ వద్ద గోలేటి బ్రాంచ్ కా ర్యదర్శి ఎస్.తిరుపతి జెండా ఆవిష్కరించారు. కార్యక్ర మాల్లో సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఖైరి గూడ ఓపెన్‌కాస్టు సీనియర్ నాయకులు దేవరకొండ దివాకర్, మోడం సత్యనారాయణ, గోలేటి సీహెచ్‌పీలో ఎంబడి రామయ్య పాల్గొన్నారు.

**వాంకిడి, (ఆంధ్రజ్యోతి):** మండలంలో మే డే వే డుకలను కార్మికులు నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీ కార్మిక సంఘం కార్యాలయం, భవన నిర్మాణ సంఘం కార్యాలయాల వద్ద భవన నిర్మాణ సంఘం నాయకుడు ఉప్పరి రాములు, ఖిరిడి గ్రామంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ జెండా ఎగురవేశారు, కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్, పీఏసీఎస్ చైర్మన్ జాబిరే పెంటు, అంబేద్కర్ సంఘం నాయకులు దుర్గం సందీప్, విలాస్, దుర్గం ప్రశాంత్, సీపీఐ జిల్లా నాయకుడు గోపినాథ్, వ్యాపార సంఘం నాయకులు గాదే అవినాష్, ప్రవీణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూసీ నాయకులు, కార్మికులు



ఆసిఫాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు కృష్ణమాచారి

**బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి):** బెజ్జూరు మండలంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేం ద్రంలో కార్మికుల యూనియన్ అధ్యక్షుడు మేకల శ్రీని వాస్ ఆధ్వర్యంలో మేడే జెండాను ఎగురవేశారు. ఎంపీ డీవో ప్రవీణ్‌కుమార్ ఉపాధి కూలీలతో కలిసి మే డే వేడుకలు నిర్వహించారు.

**జైనూర్, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో కార్మికు లు మే డే ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట జెండా ఎగుర వేశారు. సీఐటీయు నాయకులు కార్మికుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

**కెరమెరి, (ఆంధ్రజ్యోతి):** కెరమెరిలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జెండా అవిష్క రిం చారు. సీఐటీయూ జిల్లా నాయ కుడు పుట్కేల అనంద్ రావు మాట్లాడుతూ కార్మికులు హక్కుల కోసం సంఘ టితంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రమేశ్, సంతోష్, స్వామి, అనిల్, రాజు పాల్గొన్నారు.

**కౌటాల, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో మే డే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిచారు. ఆయా కార్యక్రమాల్లో మోహర్లే నగేష్, రవి, ఇప్ప ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## దర్గా పరిసరాల్లో పారిశుధ్య పనులు

సిర్పూరు(టి), మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలోని దర్గా వద్ద ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే ఉర్సు ఉత్సావాల సందర్భంగా సిర్పూరు(టి) గ్రామ పంచాయతీ ఈవో తిరుపతి ఆధ్వర్యంలో కార్మికులు పారిశుధ్య పనులు నిర్వహించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. మంచినీరు, ఇతర వసతి కల్పించను న్నామని చెప్పారు. ఈ మేరకు పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేశామని ఈవో తిరుపతి తెలిపారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ ప్రేమ్‌కుమార్, పాల్గొన్న ఎస్సై సుధాకర్

కాగజ్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ ప్రేమ్‌కుమార్ అన్నారు. పోలీస్‌స్టేషన్ లో గురువారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహక రించాలన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అంతా సహకరించాలన్నారు. సట్టా, మట్కా జూదం ఆడకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. చోరీలు జరుగకుండా గస్తీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సూచించారు. ప్రజల రక్షణకే తాము అధిక ప్రాముఖ్యం ఇస్తామని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులకు సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



# గుండాయిపేట వంతెనకు మోక్షమెప్పుడు..?

- రెండేళ్ల క్రితం శంకుస్థాపన
- పనులు చేపట్టకపోవడంతో స్థానికుల ఆందోళన



గత ప్రభుత్వం వేసిన శిలాఫలాకం

కౌటాల, మే 1 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని గుండాయిపేట వద్ద వంతెన పనులు అడుగు ముందుకు పడడం లేదు. అంతర్రాష్ట్ర వారధి నిర్మాణం చేపడితే రెండు రాష్ట్రాల ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ నదిపై వారధి పూర్తయితే గుండాయిపేట నుంచి మహారాష్ట్ర నందివర్ధన్‌కు రవాణా సౌకర్యం మెరుగు పడనుంది. ప్రస్తుతం ఇక్కడ వంతెన లేక పోవడంతో వాహనదారులు మహారాష్ట్రకు చేరుకునేందుకు సిర్పూర్(టి) మీదుగా సుమారు 65 కిలో మీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గుండాయిపేట వంతెన నిర్మాణాన్ని పట్టించుకోక పోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**● రెండు రాష్ట్రాల మధ్య**

తెలంగాణ, మహారాష్ట్ర మధ్యలో గల వార్ధా నదిపై రెండు రాష్ట్రాలను కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇందుకు 75 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. ఈ వంతెన నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వంతెన నిర్మాణం జరిగితే ఉపయోగాలను వివరించారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ వంతెనకు నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టేందుకు కోనేరు కోనప్ప శంకుస్థాపన సైతం చేశారు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచి పోయాయి. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఈ వంతెన రద్దు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో కౌటాల మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వంతెన నిర్మించాల్సిన నది

**వంతెన పనులు చేపట్టాలి..**



రెండు రాష్ట్రాలను కలిపే ఈ వంతెన పనులు అధికారులు, నాయకులు స్పందించి నిర్మించాలి. వంతెన పూర్తయితే మహారాష్ట్రకు సరిహద్దున ఉండే గ్రామాల ప్రజలకు రవాణా పరంగా సౌకర్యం ఉంటుంది. ఇక్కడి వారితో మహారాష్ట్ర వాసులకు సత్సంబంధాలున్నాయి. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- అరుణ, వీర్దండి

**ప్రజల ఆశలు ఆవిరయ్యాయి..**



గుండాయిపేట వద్ద వార్ధనదిపై నిర్మిస్తున్న వంతెన రద్దు చేస్తున్నారని ప్రచారం జరుగడంతో ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. ఈ వంతెన నిర్మించకుంటే ఈ ప్రాంతంలో అభివృద్ధి నిలిచిపోతుంది. వంతెన నిర్మాణం పూర్తి అయితే రవాణా భారం తగ్గి వ్యవసాయ, వ్యాపార పరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

- భావ్‌రావు, గుండాయిపేట

## మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

**● ఇమ్రాన్, ఏఈ**



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి :** మెరుగైన విద్యుత్ సరఫరాకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

**ఏఈ:** మండలంలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు 28 ట్రాన్స్‌ఫార్మర్లకు కోసం ప్రతిపాదనలు పంపించాం. 16 ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయి. ఇంకా 12 ట్రాన్స్‌ఫార్మర్లు రావాల్సి ఉంది.

**ఆంధ్రజ్యోతి :** మండలంలో గృహజ్యోతి పథకం ఎంత మందికి వర్తిస్తోంది?

**ఏఈ :** మండలంలో 60 శాతం సర్వీసులకు గృహజ్యోతి పథకం వర్తిస్తోంది. మండలంలో 13,375 మంది సర్వీసులున్నాయి. 1,011 వ్యాపార సముదాయాలుండగా, వ్యవయాసాయి 1,147 సర్వీసులున్నాయి.

**ఆంధ్రజ్యోతి :** పలు చోట్ల విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. వీటిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**ఏఈ :** మండలంలో పలు గ్రామాల్లో ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లు ఉన్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రెబ్బెన, ఆంధ్రజ్యోతి

## 5న కేంద్ర మంత్రి పర్యటన


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

రెబ్బెన, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సోమవారం కుమరం భీం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి పనుల ప్రారంభోత్సవానికి హాజరవుతున్నారని, దీన్ని విజయవంతం చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఎక్స్‌రోడ్‌లో గురువారం మంచిర్యాల, కుమరం భీం జిల్లాల కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు జిల్లాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం చేసేలా చూడాలన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు, ఆయా జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

## వాహనాలకు అనుమతి పత్రాలు తప్పనిసరి

సిర్పూరు(టి), మే 1 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు అనుమతి పత్రాలు తప్పకుండా ఉండాలని, నంబరు ప్లేటు లేని వాటిని సీజ్ చేస్తామని సిర్పూరు(టి) ఎస్సై కమలాకర్ అన్నారు. సిర్పూరు(టి)లో గురువారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్లు ప్లేటు లేని వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు.

## వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కెరమెరి, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకొవాలని ఎంఈవో ప్రకాష్ అన్నారు. గోయగాం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రభుత్వం 15 రోజుల పాటు శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్, డ్యాన్స్, యోగ, కరాటే, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వెదురు మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన

వాంకిడి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్కగుడ గ్రామంలో గురువారం వెదురు మొక్కల పెంపకంపై మహారాష్ట్రలోని పూనే, ముంబైలోని ఇండస్ట్రియల్ ఫౌండేషన్ ట్రైనర్స్ సృష్టి, ధావన్ షఫీ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ ఈ ఏడాది వెదురు చెట్లు పెంచుకునే వారికి త్రిపుర నుంచి వెదురు మొక్కలు తెప్పించి ప్రతి ఒక్కరికీ 60 చొప్పున మొక్కలు అందజేస్తామన్నారు. ఈ మొక్కలను 15 గుంటల భూమిలో నాటుకోవాలని ఒక్కో చెట్టుకు చుట్టు 15 ఫీట్‌ల దూరంలో నాటు కోవాల్సి ఉంటుందన్నారు. రెండు సంవత్సరాలు అంతర్ పంటగా పంట వేసుకోవచ్చని తరువాత నాలుగేళ్లకు వెదురును అమ్ముకోవచ్చని తెలిపారు. ఇలా ఏటా వెదురును అమ్ముకుంటే ఏడాదికి సుమారుగా రూ. 40, నుంచి 50 వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. వెదురు అమ్ముకోవడానికి అటవి శాఖ ద్వారా అను మతి ఉంటుం దని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం సారయ్య, ఏపీఎం మహేష్, సీసీలు భీంరావు, సురేందర్, వీవోఏ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## వంద శాతం అక్షరాస్యత సాధించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించేం దుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గురువారం నవ భారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా వంద శాతం అక్షరాస్యత సాధనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ తివారి మాట్లాడుతూ కేంద్ర ప్రయోజిత పథకాలలో ఉల్లాస్ అనేది ఒకటని చెప్పారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్య అవకాశం కోల్పోయిన 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాసులకు ప్రాథమిక అక్షరాస్యత కల్పించడమే లక్ష్యమన్నారు. బడి వయసు గల పిల్లలను బడి బయట ఉండకుండా అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జీ డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో దత్తరావు, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎంహెచ్‌వో తుకారాం, డీడబ్ల్యూవో భాస్కర్, ఏపీడీ రామకృష్ణ, విద్యశాఖ అధికారులు ఉదయ్‌బాబు, మధుకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ఒకరికి పదేళ్లు జైలు శిక్ష

ఆసిఫాబాద్‌రూరల్/లింగాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, 50 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పారు. లింగాపూర్ ఎస్సై చుంచు గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకాకు చెందిన ఓ మహిళకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఆ మహిళది లింగాపూర్ మండలంలోని ఓ గ్రామం. మహిళ తన ముగ్గురు కూతుళ్లతో గ్రామంలో నివసిస్తోంది. పెద్ద కుమార్తె ఆరోగ్యం బాగా లేనందున 24.7.2019న ఆదిలాబాద్ ఆస్పత్రికి తీసుకు వెళ్లింది. వైద్య పరీక్షల తర్వాత ఆమె ఏడు నెలల గర్భిణి అని డాక్టర్లు తెలిపారు. ఈ విషయం గురించి తల్లి కూతురును ప్రశ్నించింది. దీంతో ఆమె అమ్మమ్మ గ్రామానికి చెందిన కెంద్రె చంద్రకాంత్ తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని లైంగిన దాడికి పాల్పడ్డాడని చెప్పింది. దంతో బాలిక తల్లి లింగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ. 50వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారని ఎస్సై గంగన్న తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న కుమ్మరి రవీందర్

కోటపల్లి,మే 1 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రొయ్యలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రవీందర్ అనే వ్యక్తి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. రవీందర్ గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. భార్య కళావతితో పాటు ఇద్దరు పిల్లలతో కూలి పని చేసు కుంటూ జీవిస్తున్నాడు. తనకు సొంత ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు కోసం దర ఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఇందిరమ్మ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఇళ్లను మంజూరు చేసింది. మొదటగా రొయ్యలపలి గ్రామానికి 27 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ జాబితాలో రవీందర్ పేరు కూడా ఉంది. అయితే ఇళ్ల సంఖ్యను తగ్గించాలనే ఆదేశాలతో ఇందులో నుంచి 10 ఇళ్లను తొలగించారు. ఇందులో రవీందర్ పేరు తొలగించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గ్రామ ఇంది రమ్మ కమిటీ వల్లనే తనకు ఇల్లు దక్కడం లేదని తీవ్ర ఆవేదనకు గురై రవీందర్ బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

## ముగిసిన సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు

భీమారం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి వార్డుకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ రామల సాగర్ బుధవారం గుండెపోటుతో మృతిచెందగా ఆయన స్వగ్రామమైన భీమారంలో సీఆర్‌పీఎఫ్ ఏసీపీ ర్యాంకు అధికారి రాకేష్, సీఐ ర్యాంకు అధికారి జక్రయా ఆధ్వర్యంలో 13 మంది కానిస్టేబుళ్లు అధికార లాంచనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. జవాన్‌కు గౌరవ వందనం చేసి అంత్యక్రి యలు నిర్వహించారు. దేశానికి సేవ చేయాల్సిన జవాన్ అకాల మరణం పొందడం కలిచి వేసిందని అధికారులు పేర్కొన్నారు. అంత్యక్రియల్లో కుటుంబీకులు, బంధుమిత్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రమ శక్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న నరేందర్

మందమర్రిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఫైన్‌మెన్, ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్ గురువారం మే డే సందర్భంగా ప్రభుత్వం అందించే శ్రమ శక్తి అవార్డును ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నందుకు అవార్డును అందుకున్నారు.

## పేకాట స్థావరంపై దాడి

జైనూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): జైనూరు సమీపంలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి ఆరు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు. నిందితుల నుంచి 12,450 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు

# గనులపై మే డే వేడుకలు






శ్రీరాంపూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు

శ్రీరాంపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గనులపై కార్మికులు, కార్మిక సంఘం నాయకులు మే డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఆర్కే 7, న్యూటెక్ గనులపై ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ఐకే1ఏ గనిపై ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఓసీపీ, సీహెచ్‌పీలపై బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఎస్ఆర్‌పీ 1, 3 గనులపై సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్కే 5, 6 గనులపై ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగ రాజేశ్వర్ రావు, నాయకులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, దాడి రాజయ్య, సంఘం సదానందం, మోతె లచ్చన్న, గునిగంటి నర్సింగారావు, తదితరులు పాల్గొన్నారు. ఆర్కే 6 గనిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, పిట్ కార్యదర్శి సంఘం సదానందం జెండావిష్కరణ చేశారు. సహాయ కార్యదర్శి కారుకూరి నగేష్, ఉపాధ్యక్షుడు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు. టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయం వద్ద ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మేడే జెండా ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు విజిత్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఎండీ లాల, తదితరులు పాల్గొన్నారు. హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పీ 1, ఆర్కే 7, న్యూటెక్, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీ, యూనియన్ కార్యాలయం వద్ద ఎర్ర జెండాలు ఎగుర వేశారు. కార్మికవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్‌రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్, గోళ్ల సత్యనారాయణ, కంబాల నర్సయ్య, తుల అనిల్ కుమార్, చెవుల శ్రీనివాస్, మీసాల మహేందర్, దుర్గం లక్ష్మణ్, పులి రాజేందర్, నామాల శ్రీనివాస్, నేముల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు. ఐఎన్‌టీ యూసీ ఆధ్వర్యంలో ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి జెండా ఆవిష్కరించారు. కేంద్ర కార్యదర్శి ల్యాగల శ్రీనివాస్, ఉప ప్రధాన కార్యదర్శి పేరం రమేష్, జీవన్ జోయల్, భీం రవి, నీలం సదయ్య, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తరోడ్డు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వెంకన్న, రమేష్, కృష్ణ, సాయి, తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించగా, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో యాదగిరి, గొట్టె శ్రీనివాస్, అశోక్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. చంద్రశేఖర్, శ్రీనివాస్, బానేశ్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. తాళ్లపల్లి మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని కార్మికుడి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు.

**మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో మే డే వేడుకలను ఏఐటీయూసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూఐసీ ప్రధాన కార్యదర్శి కొమిరి రాజ్‌కుమార్ హాజరై మే డే జెండాను ఆవిష్కరించారు. అమరుల వీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భీమనాదుని సుదర్శన్, రాజేశం, శ్రీనివాస్, ఆంజనేయులు, రాజేశ్వర్ రావు, రమణ, దినేష్, మల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని వీటి అబ్రహం స్థూపానికి ఏఐటీయూసీ నాయకులు నివాళులర్పించారు. బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ నాయకులు మే డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సివిల్ డిపార్టుమెంట్ వద్ద జెండాను రాష్ట్ర నాయకుడు నాగరాజు గోపాల్, నాయకులు అల్లి రాజేందర్, వెంకటస్వామిలు ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద మేడిపల్లి సంపత్, ఓ రాజశేఖర్ జెండాను ఆవిష్కరించారు. హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద శ్రీనివాస్, రాజిరెడ్డిలు జెండాను ఎగురవేశారు. పట్టణంలోని రాష్ట్రీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు రంజిత్‌గౌడ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మే డే జెండాను ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యాక్షుడు దేవి భూమయ్యలు ఆవిష్కరించారు. కేకే 5 గని వద్ద ఏఐటీయూసీ నాయకులు గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్‌లు జెండా ఆవిష్కరించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు సూర్యనారాయణ, భిక్షపతిలు జెండా ఎగురవేశారు. సీఐటీయూ నాయకులు వెంకటస్వామి జెండా ఆవిష్కరించారు. సివిల్ డిపార్టుమెంట్, వర్క్‌షాపు, ఏరియా స్టోర్స్‌కేకే ఓసీపీ వద్ద ఆయా యూనియన్‌ల నాయకులు జెండాలను ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు.

**కాసిపేట, (ఆంధ్రజ్యోతి):** సోమగూడెం, కాసిపేట 1, 2వగనులతో పాటు దేవాపూర్‌లో మే డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికులు ఐక్యమత్యంగా ఉండి ఉద్యమాలు చేసినప్పుడే హక్కులు సాధ్యమవుతాయని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, వెంకటస్వామి, మీనుగు లక్ష్మీనారాయణ, గోళ్ల శ్రీనివాస్, రవీందర్, నర్సయ్య, శంకర్, లింగయ్య, శ్రీహరి, శ్రీధర్, ఆడెపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

# కార్మికుల సమష్టి పోరాట ఫలితమే మే డే



బెల్లంపల్లిలో మేడే సంబురాలు జరుపుకుంటున్న సీపీఐ నాయకులు



తాండూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, మే1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం వివిధ పార్టీల ఆధ్వర్యంలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టీయుసీ, సీపీఐ, టీఎస్‌టీయుసీ, ఎంసీపీఐయు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పతకాన్ని ఆసంఘాల నాయకులు ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు మల్లయ్య, మణిరాంసింగ్, రాజలింగు, క్రిష్ణమోహన్, పాల్గొన్నారు.

**తాండూర్:** మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్ ముందు 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మొగిలి, సీపీఐ జిల్లా సమితిసభ్యులు బానేష్ జెండా ఆవిష్కరించారు. నాయకులు ప్రహ్లాద్, సత్యనారాయణ, శంకర్, రాజేష్ పాల్గొన్నారు.

**దండేపల్లి:** దండేపల్లిలో సెక్షన్ ఆఫీస్ కార్యాలయం వద్ద గురువారం సంఘం నాయకులతో కలిసి మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 327 ఐఎన్‌టీయుసీ స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి పర్రే రమేష్, ఆసంఘం జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి ఉన్నారు.

●మేడే దినోత్సవం పురస్కరించుకుని దండేపలిలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో అరుణ పతక జెండా సీపీఐ మండల కార్యదర్శి రాజేష్ ఎగురవేశారు.

**గర్మిళ్ల:** జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆగాచారి జెండా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, పాల్గొన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నాయకులు జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో మేడే జెండా ఆవిష్కరించారు. అధ్యక్షుడు రాజలింగు పాల్గొన్నారు.

**నెన్నెల :** గ్రామాల్లో మే డే సందర్భంగా అరుణ పతాకాలు రెపరెపలాడాయి. మండల కేంద్రంలోని కుశ్నపల్లి చౌరస్తా వద్ద ఏఐకే ఎంఎస్ జిల్లా అధ్యక్షులు రత్నం తిరుపతి పతాకాన్ని ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హమాలి యూనియన్ అధ్యక్షుడు బక్క య్య జెండా ఎగురవేశారు.

### ఊరూరా కార్మికుల ర్యాలీలు..
### వాడవాడలా జెండా ఆవిష్కరణలు

**చెన్నూరు :** చెన్నూరు పట్టణంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. హమాలీ సంఘం నాయకులు, కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. హమాలీలు, కార్మికులు పాల్గొన్నారు.

**భీమారం :** మండల కేంద్రంలో గురువారం హమాలీ సంఘం అధ్యక్షుడు రాజన్న ఎర్ర జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పొలంపల్లిలో కార్మిక నాయకుడు తిరుపతి జెండా ఎగురవేశారు.

**లక్షెట్టిపేట:** లక్షెట్టిపేటలో 139వ మేడే వేడుకలను వివిధ సంఘాల, పార్టీల ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఊత్కూర్ చౌరస్తాలో గల డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయుసీ, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో కార్మికులు ఆయా పార్టీల జెండాలను ఆవిష్కరించారు.

**మందమర్రిరూరల్ :** రామకృష్ణపూర్‌లో గురువారం మేడే వేడుకలను ఆయా యూనియన్‌ల నాయకులు నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు అక్బరలీ జెండాను ఎగురవేశారు.

**కోటపల్లి :** మండలంలోని శెట్‌పల్లిలో సీపీఎం నాయకులు అనిల్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**జన్నారం:** జన్నారంలో గురువారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. హమాలీ కార్మిక సంఘం నాయకులు జన్నారంలో జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, బస్టాండ్ సమీపంలో మేడే జెండా ఆవిష్కరించారు.

**భీమిని :** మండలంలో సీఐటీయూ సీనియర్ నాయకురాలు సులోచన జెండా ఆవిష్కరించారు. నాయకురాలు చంద్రమౌళి, చీరం బ్రహ్మక్క, గట్టయ్య, ప్రణీత, అంతిక్వ పాల్గొన్నారు.




మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు

## రేపటి బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్

మంచిర్యాలక్రైం, మే1(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 3న బంద్‌ను విజయవంతం చేసి అమరుల ఆత్మశాంతి కోసం చేపట్టే ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిలో అమరుల ఆత్మశాంతి కోసం కార్పొరేషన్ పరిధిలో వాణిజ్య వ్యాపార సముదాయాలు అన్ని వర్గాల ప్రజలు బంద్ పాటించాలన్నారు. ఉదయం 10గంటలకు ఐబీ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా యూత్ అధ్యక్షులు తాళ్ల సంపత్ రెడ్డి, నస్పూర్ మాజీచైర్మన్ సూరిమల్ల వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మునీందర్, మాజీ చైర్‌పర్సన్ వసుంధర, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, నాయకులు పాల్గొన్నారు.

## కులగణన చరిత్రాత్మక నిర్ణయం

### బీజేపీ జిల్లా నాయకుడు వెరబెల్లి రఘునాథ్

దండేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కుల గణనకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారితాత్మక నిర్ణయమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. దండేపల్లిలో బీజేపీ మండల కార్యలయంలో గురువారం నాయకులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభి షేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు గురువయ్య, సంతోష్, వెంకటేశ్వర్లు, సురేందర్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కాసిపేట, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గగూడెంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచి సకాలంలో ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి అజ్మీరా పురుషోత్తం నాయక్ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం దేవాపూర్‌తోపాటు గిరిజన గూడాల్లో నెలకొన్న నీటి ఎద్దడిని పరిశీలించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బుగ్గగూడెంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. మండలంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులందరూ సమయ పాలన పాటించాలి, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు ఈ సమావేశంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో సప్దర్ అలీ, ఏపీఎం వెంకటేశ్, బీఆర్‌పీ అశోక్‌రావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రభంజనం




విద్యార్థులను సన్మానిస్తున్న కరెస్పాండెంట్ ఫయాజ్‌ఖాన్, ప్రిన్సిపల్ కయిం

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ఫలితాల్లో చెన్నూరు పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. హరిప్రియ 582 మార్కులు సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అలాగే పాఠశాలలో 551, 550, 549, 546, 540, 539, 538 మార్కులు సాధించిన విద్యార్థులు 13 మంది ఉండగా పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఫయాజ్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కయిం విద్యార్థులను గురువారం పాఠశాలలో అభినందించి సన్మానించారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇళ్ల మంజూరులో అక్రమాలకు తావు లేదు

కోటపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎలాంటి అక్రమాలకు తావు లేదని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఉన్న పేర్లను డబుల్ వెరిఫికేషన్ అయిన తర్వాతనే ఇండ్లు మంజూరు చేస్తామని, అర్హులైన వారికి తప్పకుండా ఇండ్లు ఇస్తామని, కావాలనే కొంత మంది ఇందిరమ్మ ఇండ్లపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కోట పల్లి మండలంలోని రొయ్యలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రవీందర్ ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేదని మనస్థాపంతో ఆత్మహత్యయత్నం చేసుకోవడం బాధకరమన్నారు. వెంటనే రవీందర్‌కు ఫోన్ చేసి మాట్లాడి న్యాయం చేస్తానని హామీఇచ్చినట్లు పేర్కొన్నారు. రవీందర్‌కు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సూచించినట్లు పేర్కొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గత నెలలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన జెండాలను కమిషనర్ అవమానపరిచాడని వాపోయారు. తొలగించిన జెండాలను చెత్త తరలించే వాహనంలో తరలించి డంపింగ్‌యార్డులో పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండాలను తొలగించి తరలించే ముందు కమిటీ సభ్యులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదో చెప్పాలన్నారు. కమిషనర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని లేనిచో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు చెన్నూరు మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అధికార పార్టీ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీలను తాము ఏర్పాటు చేస్తే రాత్రికి రాత్రే తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన ప్రభు త్వ ఉద్యోగులు అధికార పార్టీ అండదండలు చూసుకుని ఇష్టారీతిన వ్యవహరించడం తగదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## దివాకరన్న పెరుగన్నం ప్రారంభం

గర్మిళ్ల, ఏప్రిల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివాకరన్న పెరుగన్న పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పెరుగన్న పంపిణీ చేపడుతు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ట్రస్టు చైర్మన్ నడిపెల్లి విజిత్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభ్యంతకర పోస్టులు పెడితే కఠిన చర్యలు

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని చెన్నూరు సీఐ దేవేందర్ పేర్కొన్నారు. గురువారం ఆ యన మాట్లాడుతూ ఒకరిని కానీ, ఒక వర్గాన్ని కానీ కించపరిచే విధంగా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టవద్దని సూచించారు. వాట్సాప్‌లో ఎవరైనా అభ్యంతకర పోస్టులు పెడితే దానికి పూర్తి బాధ్యత గ్రూప్ అడ్మిన్ వహించాల్సి ఉంటుందన్నా రు. సోషల్ మీడియాలో అసత్యాలను ప్రచారం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ఫలించిన బీసీల పోరాటం

మంచిర్యాల క్రైం, మే1(ఆంధ్రజ్యోతి): బీసీల పోరాటం వల్లనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు పూనుకుందని బీసీ జిల్లా అధ్యక్షుడు ఉడారి చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ఏప్రిల్ 2న ఢిల్లీలో చేసిన బీసీల ధర్నా చేయడం సీఎం కూడ పాల్గొనడంతోనే మోదీ కులగణన చేపట్టారన్నారు. ఇప్పటికైన సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50శాతం పరిమితిని ఎత్తివేసి దామాషా ప్రకారం దేశవ్యాప్తంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. తెలంగాణలో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

# రాముని చెరువు సుందరీకరణకు మోక్షమెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

పనుల్లో భాగంగా చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, రెండు పక్కల ఇనుప గ్రిల్స్, హై టెక్‌సిటీ, జాఫర్ నగర్ ప్రాంతాల నుంచి చెరువులో బతు కమ్మల నిమజ్జనం కోసం మెట్ల నిర్మాణం, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో కేవలం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు పనులు దాదాపుగా పూర్తికాగా, రెండు చోట్ల మెట్ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్, ప్రజలు సేదదీరేందుకు బెంచీల ఏర్పాటు, కట్టవెంట విద్యుత్ దీపాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. చెరువులో పెరిగిన గుర్రపు డెక్క, తామర, పిచ్చిమొక్కలతో పూడిక తీత పనులు ముందుకు సాగడం లేదు. ఈ వేసవిలోపు పై పనులన్నీ పూర్తయ్యే పరిస్థితులు కనిపించడంలేదు.

### బోటింగ్ ఊసేది..?

సుందరీకరణలో భాగంగా రాముని చెరువులో ప్రస్తుతం ఉన్న మురుగునీరు, పూడికనంతా తొలగించి, కొత్త నీటితో నింపాలని నిర్ణయించారు. అలా చెరువును శుద్ధి చేసిన అనంతరం అందులో టూరిజం శాఖ నుంచి బోటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా పార్కుగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు అందుబాటులో ఉన్న ఏకైక చెరువు కావడంతో అన్ని ఏర్పాట్లు చేయడం ద్వారా అభివృద్ధి చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. వాస్తవానికి రాముని చెరువులో బోటింగ్, ఇతర ఏర్పాట్లు చేస్తే ప్రజలకు ఆహ్లాదకర వాతారణం కల్పించినట్లు అవుతుంది. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది. పట్టణంలోని పలు కాలనీల ప్రజలు చెరువు కట్టపై వాకింగ్ చేస్తుంటారు. వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2017లో అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సుమారు రూ. 80 లక్షలతో చెరువు అభివృద్ధికి పూనుకున్నారు. చెరువు చుట్టూ కట్ట నిర్మించి, మట్టితో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయించారు. కాలక్రమంలో నిర్వహణ లోపంతో కట్టపై పిచ్చి మొక్కలు మొలవడంతో ప్రజలు అక్కడికి రావడం మానేశారు. పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక చెరువు కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు త్వరితగతిన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మండల టాపర్లకు ఘన సన్మానం

దండేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో దండేపల్లి మండల టాపర్లుగా నిలిచిన దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షయ. శ్రీలక్ష్మీ, దీక్షితలను గురువారం స్థానిక పాఠశాలోని వారిని ఘనంగా సన్మానించారు. ముగ్గురు విద్యార్థులను మాజీ సర్పంచు బిళ్లకూరి శంకరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వజ్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**తాండూర్ :** పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను తాండూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి ఘనంగా శాలువాలతో సన్మానించారు. అచ్చలాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుప్పాల పూజిత 567 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా రేచిని జిల్లా పరిష త్ విద్యార్థి పెద్దింటి మల్లికార్జున్ 547, అచ్చలాపూర్ జిల్లా పరిషత్ విద్యార్థి సముద్రాల జశ్వంత్ 541లను ఘనంగా సన్మానించారు. సీఐ కుమారస్వామి పూజితకు రూ. 10 వేలు, మల్లికార్జున్‌కు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ రూ. 6 వేలు, జశ్వంత్‌కు ఎంపీడీవో శ్రీనివాస్ రూ. 4 వేల ప్రైజ్ మనీ అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి మార్కులు సాధించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో అనిల్‌కుమార్, ఎంఈవో మల్లేశం, ఏవో సుష్మ, హెచ్‌ఎంలు ఉమాదేవి, ప్రదీప్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**జైపూర్ :** కార్పొరేట్ పాఠశాలలక దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందు తుందని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పేర్కొన్నారు.

మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులు సముద్రాల నక్షత్ర 523, అక్కల దేవికలు 495 మార్కులు సాధించగా గురువారం హాస్టల్‌లో వీరిని ఘనంగా శాలువాలతో సన్మా నించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీ సర్ సుధాలక్ష్మీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మ న్ మద్దుల సునీతరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

మందమర్రిరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో పూర్తిస్థాయిలో అమలు చేసేలా చూడాలని సూచించారు. డ్రైనేజీలు ,రోడ్లను శుభ్రం చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మందమర్రిరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని బీజేపీ నాయకుడు దేవరనేని సంజీవరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో అనర్హులను ఎంపిక చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు అవకతవకలకు పాల్పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన జాబితాను పంచాయతీ కార్యాలయంలో అంటించాలని అప్పుడే నిరు పేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

**జన్నారం :** అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని రేండ్లగూడ గ్రామస్తులు కోరారు. గురువారం రేండ్లగూడ పంచాయతీలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారని ఈ విషయంపై పంచా యతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే కమిటీ సభ్యులు ఎవరి పేర్లు చెబితే వారినే ఫైనల్ చేస్తామని పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో కొందరు గ్రామస్థాయి లీడర్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరి స్తున్నారని , ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారి బంధువులు, మిత్రులను, అనర్హులను ఎంపిక చేశారని దీని వల్ల అర్హులైన పేదలు నష్టపోతున్నారన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచు హైమద్, గ్రామస్తులు తిరుపతి, శ్రావణ్, సత్యం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న పర్సు అందజేసిన కండక్టర్

గర్మిళ్ల, ఏప్రిల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న బస్సులో మహిళ పోగొట్టుకున్న పర్సును బస్ కండక్టర్ అందజేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గురువారం ఉదయం మంచిర్యాల నుంచి హైద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో ఓ మహిళ తన పర్సు మర్చిపోయి గోదావరిఖని బస్టాండ్‌లో దిగింది. గుర్తించిన కండక్టర్ వీబీ రావు పర్సులో చూడగా రూ. 10 వేల నగదు, బ్యాంకు పాస్ బుక్, రెండు సెల్‌ఫోన్‌లు ఉన్నట్లు గుర్తించారు. పాస్ బుక్, ఫోన్ ఆధారంగా వివరాలు తెలుసుకుని మహిళకు సమాచారం అందించాడు. తన పర్సులో బస్సులో పోయిందని చెప్పడంతో మహిళ వచ్చేంత వరకు గోదావరిఖని, కరీంనగర్ మధ్యలో బస్సును ఆపి ఉంచారు. మహిళ వచ్చిన తర్వాత ప్రయాణికుల ముందు పర్సును మహిళకు అందజేశారు. దీంతో మహిళ కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

# మండలంలో పంట నష్టం సర్వే

● 241 ఎకరాల్లో నేలరాలిన మామిడి
● వ్యవసాయ, ఉద్యాన అధికారుల సర్వే

నెన్నెల, మే 1 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు గురువారం మండలంలో పర్యటించారు. బుధవారం సాయంత్రం గంట పాటు కురిసిన వడగళ్లు, గాలిదుమారం అపార నష్టాన్ని మిగిల్చింది. పలు ఇళ్లు దెబ్బతినగా, మామిడి కాయలు నేల రాలాయి. కొతకొచ్చిన వరి పొలాలు నెలకొరిగాయి. రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే చేపట్టారు. గుండ్లసోమారంలో కూలిపోయిన ఇళ్లు, దెబ్బతిన్న పంటలను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేంద్రనాథ్‌తో కలిసి పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. బెల్లంపల్లి క్లస్టర్ హార్టికల్చర్ అధికారి అరుణ్‌కుమార్ మామిడి తోటలను సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు. ఆవడం, చిత్తాపూర్ గొళ్లపల్లి, గుండ్ల సోమారం, మైలారం, ఖర్జీ, మన్నెగూడం, నెన్నెల గ్రామాల్లోని 96 మంది రైతులకు చెందిన 241 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నదని హెచ్‌వో చెప్పారు. నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, నెన్నెల ఏవో పుప్పాల సృజన ఏఈవోలు రామ్ చందర్, మౌనికలతో కలిసి నెన్నెల, బొప్పారం, మన్నెగూడం, ఖర్జి గ్రామాల్లో పర్యటించి దెబ్బతి న్న వరి పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు.

### పంటలను పరిశీలించిన అధికారులు

భీమారం : మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి చేతికి వచ్చిన వరి పంట నేలమట్టం కాగా, కోత దశకు వచ్చిన మామిడి కాయలు రాలిపోయి రైతులు నష్టపోయారు. గురువారం వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారులు మండలంలోని దాంపూర్ పంచాయతీతో పాటు వివిధ గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండలంలో సుమారు 300 కి పైగా ఎకరాల్లో మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. కాయలు మొత్తం నేలమట్టమయ్యాయి. దీంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిపంట 200 ఎకరాల్లో నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.





గుండ్లసోమారంలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ.
భీమారంలో రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

### బీసీలకు పీసీసీలో చోటు ఇవ్వాలి

మంచిర్యాల క్రైం, మే1(ఆంధ్రజ్యోతి): బీసీలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని బీసీలకు పీసీసీలో చోటు కల్పించాలని జాతీయ ఓబీసీ చైర్మన్ అనిల్ కుమార్ జైహింద్‌యాదవ్ అన్నారు. ఢిల్లీ ఏఐసీసీ ఇంద్రభవన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయనతో పాటు ముఖ్య అతిథిగా కొప్పుల రాజు, ఓబీసీ చైర్మన్ నూతి శ్రీకాంత్, ఓబీసీ యాక్టింగ్ చైర్మన్ కొమ్ము వినయ్‌కుమార్, ఏఐసీసీ తెలంగాణ ఓబీసీ చైర్మన్ రవికుమార్‌తో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు అన్ని అవకాశాలు కల్పించాలని రాబోయే ఎన్నికల్లో మండలస్థాయి, గ్రామస్థాయి వరకు ఓబీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మోదీ జాతీయస్థాయిలో కులగణన ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

### రేషన్ బియ్యం విక్రయిస్తే కార్డు రద్దు

నస్పూర్, ఏప్రిల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం అమ్ముకున్న లబ్దిదారుల రేషన్ కార్డు రద్దు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన 11 మంది రేషన్‌కార్డు దారులు ద్వారా పొందిన సన్న బియ్యంను అమ్ముకున్నారనే సమాచారంతో లబ్దిదారుల రేషన్ కార్డులు రద్దు చేశామన్నారు. ఈ 11 మంది రేషన్ కార్డుదారులు గ్రామానికి చెందిన మహేశ్‌కు బియ్యం అమ్ముకోవడంతో మహేశ్ నివాసంలో తనిఖీలు చేయగా సన్న బియ్యం లభించాయని తెలిపారు. సన్న బియ్యం విక్రయించినట్లయితే సంబంధిత కార్డులు రద్దు చేయడంతో పాటు బియ్యం కొనుగోలు చేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.


**గుండాయిపేట వంతెనకు మోక్షమెప్పుడు?**

● పనులు చేపట్టకపోవడంతో స్థానికుల ఆందోళన 6


## రాముని చెరువు సుందరీకరణకు
# మోక్షమెప్పుడో..?



- సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న పనులు
- మురుగు నీరు తొలగింపులో జాప్యం
- వర్షాలు కురిస్తే అర్ధాంతరంగా వదిలేయాల్సిన పరిస్థితి
- రూ.3.50 కోట్లు కేటాయించినా ముందుకు సాగని పనులు

పిచ్చి మొక్కలతో కళావిహీనంగా దర్శనమిస్తున్న రాముని చెరువు

మంచిర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక పార్కుల రాముని చెరువు సుందరీకరణ పనులకు సంవత్సరాలు గడుస్తున్నా మోక్షం లభించడంలేదు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ప్రజలకు సెలవులు, ఖాళీ సమయాల్లో ఉల్లాసంగా గడపలేని పరిస్థితి నెలకొంది. గతంలో చెరువు కట్ట ఇరువైపులా పచ్చని చెట్లు, వీధిలైట్లు, కూర్చునేందుకు బెంచీలతో కళకళలాడేది. సందర్శకులతో నిత్యం బిజీగా ఉండేది. వయోవృద్ధులు, వాకర్స్ కాలక్షేపంకోసం చెరువు కట్టపై గంటల తరబడి గడిపేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సుందరీకరణ పేరుతో చేపడుతున్న పనుల్లో జాప్యం కారణంగా చెరువు ప్రాంతం కళావిహీనంగా దర్శనమిస్తోంది. డ్రైనేజీల నుంచి వచ్చే మురుగు నీటి కారణంగా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటమే దీనికి ప్రధాన కారణం.

**మురుగు నీరు తొలగింపులో జాప్యం....**

చెరువు సుందరీకరణలో భాగంగా మొదట వివిధ ప్రాంతాల నంచి వచ్చే డ్రైనేజీల మురుగు నీటిని పూర్తిగా తొలగించి, పూడిక తీయాలని ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా చెరువు అడుగు భాగం నుంచి శుభ్రం చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఈ క్రమంలో చెరువుకు పడమర వైపు ఫుట్ వే బ్రిడ్జి వద్ద దాదాపు నాలుగేళ్ల క్రితం మత్తడికి గండి కొట్టారు. అందులో నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా మురుగు నీటిని బయటకు పంపక పోగా, సుందరీకణ పనులు కూడా వేగం పుంజుకోవడం లేదు. చెరువు సుందరీకరణపై అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. వేసవి, శీతాకాలంలో గండి నుంచి నీరు బయటకు వెళ్తుండగా, తిరిగి వర్షాకాలంలో పెద్ద మొత్తంలో నీరు చేరుతోంది. పైగా ఇటీవల మత్తడికి చేసిన గండిని ఇటీవల పూర్తిగా మూసివేశారు.

దీంతో చెరువులోని ము రుగునీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. గండిని మూసిన కారణంగా చెరువు ఖాళీ కాగా సుందరీకరణ పనులకు తీవ్ర ఆటంకం కలుగు తోంది. మురుగు నీటిని తొలగిస్తామని చెబుతున్న అధి కారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టకపోవడం తో ఈ పరిస్థితి నెలకొంటోంది. ప్రస్తుతం వేసవికాలం అయినందున నీటినంతా బయటకు పంపి, పూడిక తీ యిస్తే చెరువు మొత్తం ఖాళీ అయి, వర్షాకాలంలో కొత్త నీరు చేరే అవకాశం ఉంటుంది.

**సుందరీకరణకు రూ. 3.50 కోట్లు మంజూరు...**

రాముని చెరువు సుందరీకరణ కోసం నాలుగేళ్ల కిందట టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) నుంచి రూ 3.50 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టాల్సి ఉండగా, తాత్సారం చేయడంతో చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు, డీపీఆర్ తయారీ, టెండర్ల నిర్వహణ అంటూ దాదాపు రెండేళ్ల పాటు పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడక జరుగుతుండటంతో పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. సుందరీకరణ...


మిగతా 7లో


### కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



కాసిపేటలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

కాసిపేట, మే1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణన చేపట్టడం చారిత్రాత్మకమని బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జాతీయ గణన వల్ల వివిధ బడుగు, బలహీనవర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. కాబట్టి జాతీయ కుల గణన, జనగణన చేపట్టడం గొప్ప విషయమన్నారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల నుంచి పోటీ చేయాలని కార్మికులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే బీజేపీకి బలాన్నిస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యమైందన్నారు. జాతీయ గణన చేస్తానని మోదీ ప్రకటించడం పట్ల మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, మండల ఇన్‌చార్జి సుధీర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు సంపత్ కుమార్, సంగీత, సంతోష్‌రెడ్డి బాల్‌రాజు, పెద్దపల్లి శంకర్, రాంచందర్, విష్ణువర్ధన్, సురేందర్, అనిల్‌కుమార్, రమేశ్, పాల్గొన్నారు.

### సివిల్స్‌కు మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నస్పూర్, ఏప్రిల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : యుపీఎస్సీ-సీఎస్ఏటీ 2026 (సివిల్ సర్వీసెస్) పరీక్ష కోసం 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర మైనార్టీ స్టడి సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వంద మంది మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియామకం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, అన్ని రిజర్వుడ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక మెరిట్ ప్రాతిపదికన ఉంటుందన్నారు. సివిల్ సర్వీసెస్ అప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని ప్రొఫెషనల్/ సాధారణ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో https://cet.cgg.gov.in,www.tmreistelangana.cgg.gov.inవెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జూన్ 5వ తేదీన జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. ఆసక్తి అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బాధ్యతలు స్వీకరించిన న్యాయాధికారులు



జడ్జిలను శాలువాలతో సత్కరిస్తున్న న్యాయవాదులు

లక్షెట్టిపేట, మే 1(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జిగా డీ.రామ్మోహన్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిగా కాసమల్ల సాయికిరన్ గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన జడ్జిలు బదీలీపై వెళ్లడంతో వారి స్థానంలో పూర్తి బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జడ్జిలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పుష్పగుచ్చం అందజేసి శాలువాలతో ఘనగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఉపాధ్యక్షుడు నళినికాంత్, ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, జాయింట్ సెక్రటరీ సత్య గౌడ్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

### రామగుండం పరిధిలో పోలీసు యాక్టు అమలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాల క్రైం, మే1 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసుయాక్టు అమలులో ఉంటుందని రామగుం డం సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. రామగుండం పోలీసు పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో నిషేధాజ్ఞలు కొనసాగుతాయని అనుమతి లేని డ్రోణ్, డీజే సౌండ్‌లపై చర్యలు తీసు కుంటామన్నారు. చిన్న పిల్లలు, వృ ద్ధులు, రోగులు, విద్యార్థులు విద్యా భ్యాసానికి భంగం కలుగకుండా శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు డీజేలను నిషేధించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్ర తల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఆయన సూచించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను

### సమర్ధవంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సిబ్బందికి సూచించారు. మండలంలోని పలు గ్రామాలోని కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ధర్మరావుపేటలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సన్నరకం వడ్లకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ 500 అదనపు బోనస్ అందిస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అర్హులైన నిరు పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా గూడ కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను చేపడుతున్నామన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా బ్యాదతగా ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. అనంతరం దండేపల్లి ఎంపీడీవో కార్యలయాన్ని సందర్శించారు. ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మండల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసి జాబితా రూపొందించాలన్నారు. అనంతరం కన్నెపల్లి వెంకటేశ్వర్ల రైస్ మిల్లును డీఆర్‌డీవో కిషన్, తహహసీల్దార్ సంధ్యారాణితో సందర్శించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో ప్రసాద్ ఉన్నారు.



ముత్యంపేటలో కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

### క్రికెట్ పోటీల విజేత ఆర్‌కే-7 జట్టు



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 1(ఆంధ్రజ్యోతి): మే డేను పురస్కరించుకొని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నర్సయ్య స్మారక క్రికెట్ పోటీల్లో ఆర్‌కే 7 జట్టు విజేతగా నిలిచింది. శ్రీరాంపూర్ డివిజన్‌లో ఉన్న యువ కార్మికులకు నెల రోజులుగా పోటీలు నిర్వహిస్తుండగా గురువారం ఫైనల్స్ జరిగాయి. ఫైనల్స్‌లో ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్ జట్లు పోటీ పడగా, ఆర్‌కే 7 విజయం సాధించింది. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సీపై రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై ఇరు జట్లకు బహుమతులు అందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తులసిరామ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా అనిల్, బెస్ట్ బ్యాటర్‌గా నరేందర్, బెస్ట్ బౌలర్‌గా మహేష్‌లకు సైతం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సకినాల నర్సయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, సంపత్, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రోడ్డు నిర్మాణం...

● మున్సిపల్ కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు



హైటెక్‌సిటీలో అక్రమంగా నిర్మించినట్లు చెబుతున్న రోడ్డు ఇదే

మంచిర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో కొందరు వ్యక్తులు అక్రమంగారోడ్డు నిర్మించడంతో మున్సిపల్ కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. కాలనీ ఎంట్రన్స్ వద్ద నుంచి ఉన్న వంద ఫీట్ల రోడ్డు లే అవుట్ ప్రకారం ఏషియన్ టవర్ వరకు మాత్రమే ఉండాలి. వెంచర్ నిర్వాహకులు రోడ్డు చివర హద్దు రాళ్లతో నిర్మించి, యూటర్న్‌కు అవకాశం కల్పించారు. అయితే రోడ్డు చివర రాళ్లతో నిర్మించిన హద్దును కొందరు అక్రమంగా తొలగించి, రోడ్డును పొడిగిస్తూ మట్టితో తాత్కాలిక దారిని ఏర్పాటు చేశారు. స్థల పరిమితులు, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ అడిగే నాథుడే కరువయ్యారు.

రెండు సంవత్సరాల క్రిత మే అక్రమంగా రోడ్డు నిర్మించి నప్పటికీ హైటె క్‌సిటీ వెంచర్ నిర్వాహకులుగానీ, కాలనీ కమిటీ సభ్యులు పట్టించుకోకపోవడం కొసమెరుపు. అయితే అక్రమరోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గురు వారం కాలనీ వాసుల దృష్టికి రావడంతో కమిటీ మాజీ అధ్యక్షుడు సురభి రవికుమార్ నేతృత్వం లో తక్షణమే మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ శివాజీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మానసిక ఎదుగుదలకు క్రీడలు ఎంతో అవసరం

● కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : శారీరక, మానసిక ఎదుగు దలకు శిక్షణలు ఎంతో దోహదం చేస్తాయని, విద్యార్థులకు వేసవిలో విద్యతోపాటు కళలు, చిత్రలేఖనం, పెయింటింగ్‌లో శిక్షణ అందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదా య మందిరంలో గురువారం జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్యతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో వేసవి శిక్షణ శిబిరం నిర్వహణలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థుల కు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో చిత్రలే ఖనం, పెయింటింగ్, కళలు, క్రీడాంశాలలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లాలోని 50 పాఠశాలలు సిద్ధం గా ఉన్నాయన్నారు. 15 రోజుల పాటు ఈ శిబిరాలు నిర్వహించాలని ఒక్కో శిబిరానికి రూ.50 వేల నిధులు అందిస్తున్నామన్నారు. ప్రతి శిబిరం లో వంద మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఉపాద్యాయులు, వాలంట రీల ద్వారా గ్రామ పంచాయతీల వారిగా శిక్షణ అందిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుంద న్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాద్యాయులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# రెపరెపలాడిన ఎర్ర జెండాలు

● ఘనంగా మేడే వేడుకలు ● ర్యాలీలతో కదం తొక్కిన కార్మికులు



జిల్లా కేంద్రంలో జెండా ఎగుర వేస్తున్న గాజుల ముకేశ్‌గౌడ్



ర్యాలీగా వస్తున్న కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు, వ్యాపారస్తులు



నస్పూర్‌లో మాట్లాడుతున్న కలువేన శంకర్

మంచిర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 139వ మే డే ఉత్స వాలను కార్మిక సంఘాల నాయకులు గురువారం ఘనంగా జరుపు కున్నారు. సింగరేణి గనులు, వివిధ కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద జెండాలు ఆవిష్కరించి, కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, హమాలి సంఘం, ఇఫ్టూ, ఐఎన్‌టీయూసీ, కూరగాయల కార్మిక సంఘం, సీపీఐ, ఆధ్వర్యంలో ఆయా సంఘాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. మే డే వేడుకల్లో సంఘటిత, అసంఘిత కార్మికులు తరలిరావడంతో జిల్లా అంతటా ఎరుపెక్కింది. జిల్లా కేంద్రంలో వివిధ కార్మిక సంఘాల నాయ కులు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు.

**ఆటో యూనియన్ ఆధ్వర్యంలో....**

మే డే వేడుకలను మంచిర్యాల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బస్ డిపో సమీపంలో యూనియన్ రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ గాజుల ముకేష్‌గౌడ్ జెండా ఎగురవేసిన అనంతరం కేక్ కట్ చేసి, మజ్జిగ ప్యాకెట్లు పంచి పెట్టారు. అలాగే పలువురు ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులు అందజేశారు.

**నస్పూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నస్పూర్ పట్టణ సమితి ఆధ్వర్యంలో 139వ మేడే ఉత్సవాలు నస్పూర్‌లో గురువారం ఘనంగా జరి గాయి. ఆయా ప్రాంతాల్లో నాయకులు ఎర్రజెండాలను ఎగురవేశారు. షి ర్కే సెంటర్‌లో పట్టణ సమితి కార్యదర్శి మిరియాల రాజేశ్వర్‌రావు, నస్పూర్ కాల నీలో శాఖ కార్యదర్శి కొట్టే శంకరయ్య, నాగార్జున కాలనీశాఖ పట్టణ సహాయ కార్యదర్శి తంగళ్లపల్లి సురేశ్ జెండాలను ఎగురవేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణ శంకర్, మండల కార్యదర్శి జోగు ల మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా సమితి స భ్యులు ముష్కె సమ్మయ్య, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. సీపీ ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులుపాల్గొన్నారు.

**మంచిర్యాల క్రైం:** మంచిర్యాల ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఘనం గా మేడే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆటోయూనియన్ అధ్యక్షుడు తూ ముల నరేశ్ జెండాను ఎగురవేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తిరుపతి, పోలరాజ గౌడ్, బు చ్చలి మల్లేశ్, సుద్దాల రాజు పాల్గొన్నారు.

●కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిం చారు. నాయకులు హరిక్రిష్ణ, ఆశయ్య, తిరుపతి, రాజేశం పాల్గొన్నారు.

●హమాలీసంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. హమాలీసంఘం ఆఫీసు వద్ద జెండాను ఎగురవేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు పూదరి తిరుపతి, వ్యాపారస్తులు, నాయకులు పాల్గొన్నారు.